విశాలాంధ్ర కృష్ణా జిల్లా

చిరువ్యాపారులను ప్రోత్సహించండి

విశాలాంధ్ర - గుడివాడ : చిరు వ్యాపారులను ఆర్థికంగా ఆదుకోవాలని మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్ అన్నారు. స్థానిక ముబారక్ సెంటర్‌లో శనివారం నూతనంగా రాజశేఖర్, భాస్కర్‌ల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ గణపతి ట్రేడర్స్‌ను మాజీ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుత్తా చంటి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి షేక్ ముజాహిద్దీన్, బిజెపి పట్టణాధ్యక్షుడు అంగడాల సతీష్, సర్కార్, జానీ షరీఫ్‌లతో కలసి కఠారి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, చిన్నవ్యాపారంతో ప్రారంభిస్తున్న ఈ ట్రేడర్ ప్రజల మన్ననలు పొందలన్నారు.

వేధింపులపై సర్పంచ్ ఫిర్యాదు

విశాలాంధ్ర-గన్నవరం: ఎస్సీ మహిళ సర్పంచ్ అయిన తనను ఓ వ్యక్తి వేధిస్తున్నాడంటూ గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్యపై అదే గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి ముప్పనేని రవికుమార్ సామాజిక మాధ్యమాలలో అసభ్యకరమైన పోస్టులు పెడుతూ మానసికంగా వేధింపులు గురిచేస్తున్నాడు. ఇదేమిటని అడగటానికి సర్పంచ్ సౌజన్య తన అనుచరులతో కలిసి రవి ఇంటికి వెళ్లగా, ఆమెను అసభ్యంగా మాట్లాడటం జరిగింది. విషయాన్ని తెలుసుకున్న గ్రామ పెద్దలు అదేమని అడగగా కులం పేరుతో దూషించాడు. రవి తీరుపై కలత చెందిన సర్పంచ్ సౌజన్య తన భర్త నాగేశ్వరరావుతో కలిసి పోలీసులును ఆశ్రయించింది.

గూడవల్లిలో స్వచ్ఛతా రన్

విశాలాంధ్ర-గన్నవరం: మండలంలోని గూడవల్లిలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, పంచాయతీ ఆధ్వర్యంలో వరల్డ్ టాయ్ లెట్ డే పురస్కరించుకుని శనివారం స్వచ్ఛత రన్ ర్యాలీ నిర్వహించారు. శానిటరీ సిబ్బందికి ఆరోగ్య సూచనలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ కె. సునీత, సిబ్బంది పి. కోటేశ్వరరావు,యోగ టీచర్ స్వాతి , ఈఓ లు మస్తాన్ రావు,వెంకటేశ్వరరావు, కొలుసు వేణుగోపాల్, పొదిలి శ్రీనివాస్ , ఏ ఎన్ ఎంలు కుమారి, సుజాత,అంగన్వాడీ టీచర్ పద్మ, సచివాలయం సిబ్బంది వాలంటీర్స్, శానిటరీ వర్కర్స్ పాల్గొన్నారు.

సీఎంపై అసభ్య పోస్టులు పెట్టిన మహిళల అరెస్టు- విడుదల

విశాలాంధ్ర - గుడివాడ : ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి, మాజీ మంత్రి కొడాలి నాని ఫొటోలను గాడిదకు కట్టిన మహిళలను అరెస్టు చేసినట్లు 1 టౌన్ సిఐ గోవిందరాజు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ మాజీ కౌన్సిలర్ రేమల్లి ప్రభోదరాణి ఫిర్యాదు మేరకు సోషల్ మీడియలో అభ్యతరకరమైన పోస్టులు పెట్టిన అసిలేటి నిర్మల, సిరిపురపు తులసిరాణి, మాదాల సునీత, బంటు రోజలను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వీరిపై నాన్ బెయిల్ కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్టు చెప్పారు.

ఇదిలా ఉండగా, జగన్‌ను అగౌరవపరిచిన కేసులో అరెస్టు అయిన నలుగురు టిడిపి మహిళ నేతలను సొంత పూచీకత్తుపై శనివారం విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మహిళ నేతలను బయటకు తీసుకురాగా, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

హస్తకళలను ప్రోత్సహించండి

విశాలాంధ్ర - గుడివాడ : మన సాంప్రదాయానికి విలువ నిచ్చి చేనేత కార్మికులు తయారు చేసిన హస్తకళలను ప్రోతహించాలని వైసీపీ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు.స్థానిక అర్యవైశ్యా కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ హ్యాండ్‌లూమ్, హాండిక్రాఫ్ట్ అమ్మకాలు, ప్రదర్శనను గొర్ల ప్రారంభించారు. డిసెంబర్ 5 వరకు ఏర్పాటు చేసిన చేనేత హస్తకళలను ప్రజలు ప్రోత్సహించాలన్నారు. నిర్వాహకులు సింహాద్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలిపితే అరెస్టులా?

తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికల్యాణి

విశాలాంధ్ర - గుడివాడ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసే మాజీ మంత్రి కొడాలి నానిని అరెస్టు చేయని పోలీసలు, దళితులకు అందాల్సిన ఎస్సీ కార్పొరేషన్ నిధులు, 27 సంక్షేమ పథకాల రద్దుకు నిరసనగా గాడిదకు సీఎం బొమ్మ పెట్టినందుకు తెలుగుమహిళ అసిలేటి నిర్మలతో పాటు మరో ముగ్గురు మహిళలను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమాని తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్పూరి సాయికల్యాణి, అధికార ప్రతినిధి యార్లగడ సుచిత్ర, జిల్లా అధ్యక్షురాలు తలసిల సత్యవతి, స్థానిక అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, టిడిపి పట్టణాధ్యక్షుడు దింటాల రాంబాబు ఖండించారు. స్థానిక 1టౌన్ పోలీసు స్టేసన్ వద్ద శనివారం విలేకర్లుతో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ఒక చట్టం, ప్రతిపక్ష నేతకు ఒక చట్టం ఉండదన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన తెలుగు మహిళలను విడుదల చేయాలని లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

నేరాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి: ఎస్పీ

విశాలాంధ్ర, మచిలీపట్నం: మహిళా సంబంధిత నేరాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశిత సమయంలో బాధితులకు న్యాయమందించేలా ప్రతి పోలీస్ అధికారి కృషి చేయాలని జిల్లా ఎస్పీ పి.జాషువా సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశానికి ఎస్పీ జాషువా, ఎడిషనల్ ఎస్పీ ఎన్.వి.రామాంజనేయులు, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు హాజరయ్యారు. సమావేశంలో ఎస్పీ జాషువా మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. మహిళలపై నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నమోదైన కేసులను రివ్యూ చేసి విచారణలో ఉన్న కేసులన్నిటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నేరం జరిగిన సంఘటనా ప్రాంతానికి చేరుకుని సాక్ష్యాలను సేకరించి విచారణ చేయాలన్నారు. పోక్సో కేసులలో నిర్దేశించిన సమయంలో విచారణ పూర్తి చేసి బాధితులకు ప్రభుత్వం తరపున న్యాయమందించేలా కృషి చేయాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను పెండింగ్ ఉంచకుండా ఎగ్జిక్యూట్ చేసి సంబంధిత నిందితులను కోర్టు ముందు హాజరుపరచాలన్నారు.

గ్రంథాలయాలను ఆలంబనం చేసుకోవాలి

విశాలాంధ్ర - గుడివాడ : మహిళలు గ్రంథాలయలను ఆలంబనంగా చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ టి.జమలా పూర్ణమ్మ అన్నారు. శనివారం షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి మహిళా సంక్షేమంతో పాటు గ్రంథాలయ అభివృద్ధికు పెద్దపీత వేస్తునరన్నారు. నేడు గ్రంథాలయను అధునీకరించి, డిజిటల్‌గా ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ పెద్దిరాజులు,గ్రంథాలయ అధికారిని రమాదేవి, బివి రమణ, తెలుగు భాష వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్, సిబ్బంది పి.రవిచంద్ర, టి.ప్రవల్లిక, సునీత పాల్గొన్నారు.

క్రీడలు అవశ్యం

అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

విశాలాంధ్ర - గూడూరు: చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల్లో భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి మల్లవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ జీఎఫ్ఐ) ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి టెన్నికాయిట్ అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ విధమైన ఆటల పోటీలు గొప్ప అవకాశం అన్నారు. వ్యాయామం ద్వారా వికాసంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందన్నారు. సీఎం జగన్ చదువుకు ఎంతో ప్రాముఖ్యత నిస్తున్నారని అన్నారు. జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. చదువులో రాణించడానికి ఏ విధమైన శిక్షణను ఇస్తారో క్రీడల్లో సైతం రాణించటానికి కృషి చేయాలని ఎంపీ కోరారు. నాడు- నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యార్థులకు శాశ్వతమైన ఆస్తిగా విద్యను ప్రసాధిస్తున్నారన్నారు. పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరుకు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

టెన్నీకాయిట్ ఆడి విద్యార్థులలో ఉత్సాహం నింపారు. జడ్ పీ టి సి వేమూరి సురేష్ రంగబాబు, ఎం పీ పీ మధుసూదన్ రావు, బంటుమిల్లి ఎం పీ పీ వెలివెల చిన బాబు , తలుపుల వెంకట కృష్ణారావు, రాష్ట్ర ఎస్ ఎఫ్ సి డైరెక్టర్ కారుమంచి .కామేశ్వరరావు, ఎం .రాజ బాబు, కౌన్సిలర్ బళ్ల గంగయ్య, విద్యా కమిటీ చైర్మన్ నరసింహ రావు, ప్రధానోపాధ్యాయులు పాండురంగా రావు,సర్పంచ్ బి. సాంబశివయ్య ,ఆర్ బి కె చైర్మన్ మహా లక్ష్మయ్య నాయుడు ,ఎంపీటీసీ పిట్ల రామిరెడ్డి గోరిపర్తి రవి, ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్య పరిష్కరిస్తాం: మంత్రి రజిని

విశాలాంధ్ర-ఎ.కొండూరు: ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలానికి జలజీవన్ మిషన్ పథకం నిధులు రూ.38 కోట్లతో కిడ్నీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృష్ణా జలాలు సరఫరా చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఎ.కొండూరు మండలం కృష్ణారావు పాలెం పంచాయతీ శివారు మాన్సింగ్ తండా, దీప్లానగర్ తండాలలో పర్యటించి కిడ్నీ బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

మండలంలోని కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో, గిరిజన తండాల్లోని ప్రజలకు జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు సహకారంతో కృష్ణా జలాలు అందిస్తున్నామని, మిగిలిన 15 తండాల్లో కూడా త్వరలో ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందించి కిడ్నీ సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. రాబోయే ఆరు నెలల్లో రూ.6 కోట్ల ప్రభుత్వ నిధులతో పైపులైన్ ద్వారా తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కిడ్నీ బాధితుల కోసం ఇప్పటికే తిరువూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు, త్వరలో ఎ.కొండూరు పీహెచ్ లో కూడా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా స్క్రీనింగ్ టెస్ట్ లు, ఉచిత వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.బాధితులకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం ద్వారా అన్ని మందులు అందించనున్నట్లు తెలిపారు. విజయవాడలోని 12 కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆదుకోవడం జరుగుతుందన్నారు.డయాలసిస్ రోగులకు 104 సౌకర్యంతో పాటు 12 సీట్ల కెపాసిటీ గల బస్సును ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలు కిడ్నీ వ్యాధి పట్ల ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

స్టేట్ ప్రిన్సిపల్ హెల్త్ సెక్రటరీ టి. కృష్ణబాబు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సంవత్సరానికి రూ.300 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర హెల్త్ కమీషనర్ జె.నివాస్, ఏపీ వివిపి వినోద్ కుమార్, జిల్లా కలెక్టర్ఎస్.ఢిల్లీ రావు,ఆరోగ్యశ్రీ సీఈవో హరేంద్ర ప్రసాద్,జిల్లా వైద్యాధికారిణి సుహాసిని,తిరువూరు ఆర్డీవో వై.ప్రసన్నలక్ష్మి, ఎంపీడీవో పీవీఎస్ నాగేశ్వరరావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు, జడ్పిటిసి భూక్యా గనియా, సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరిచంద్రమోహన్, ఎ.కొండూరు సర్పంచ్ వెంపాటి రజిని,

రైతు సంక్షేమమే జగనన్న ధ్యేయం

విశాలాంధ్ర- గూడూరు: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి. రమేష్ అన్నారు. శనివారం గూడూరు మండలం, మల్లవోలు గ్రామంలో రు. 28.85 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోదామును మంత్రి జోగి. రమేష్, బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. మంత్రి మాట్లాడుతూ గతంలోని సొసైటీ లావాదేవీలు రూ. 15 కోట్లు నుంచి నేడు రూ.35 కోట్లు వరకు పెరిగిందని, తద్వారా ప్రతి రైతుకు రుణాలను అందించేందుకు జగన్ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. బందరు పోర్టు నిర్మాణానిక ఎంపీ బాలశౌరి నిర్విరామ కృషి చేస్తున్నారని, జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లడానికి ఆయన కృషి మరువలేనిదని మంత్రి కొనియాడారు.

బాలశౌరి మాట్లాడుతూ సహకార బ్యాంకులను కంప్యూటరీకరణ చేయడమే కాకుండా మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం నిధులను విచ్చేస్తుందన్నారు. కౌలు రైతులైన ఏ ఒక్కరిని నిరాశ పరచకుండా రుణాలను మంజూరు చేయాల్సిన బాధ్యత సహకార బ్యాంకులదేనని అన్నారు. బందరు పోర్టు నిర్మాణానికి త్వరలో అడుగులు పడనున్నాయని అందుకు సంబంధించిన రూ. 3,940 కోట్లు మంజూరు చేయడానికి బ్యాంకు నుంచి ఆమోదం లభించిందన్నారు. సాగర మాల పథకం ద్వారా పోర్టు కనెక్టివిటీకి కార్యచరణను రూపొందించామన్నారు.

ముదిరాజుపాలెంలో ...

మల్లవోలు, ముదిరాజుపాలెంలో రూ.16 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల విద్యుత్ కరణను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి. రమేష్, బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని. బాలశౌరితో కలిసి ప్రారంభించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి సహాయం చేయాలని గ్రామానికి చెందిన మహిళలు ఎంపీని అభ్యర్థించగా, అందుకు సిఐఎస్ఆర్ నిధులను మంజూరు చేయిస్తానని, ఇందు నిమిత్తం అంచనాలను రూపొందించాలని గూడూరు ఎంపీడీఓ డి. సుబ్బారావును ఎంపీ ఆదేశించారు. కే డీ సీ సీ బ్యాంక్ డైరెక్టర్ సూర్య ప్రకాష్ రావు , జడ్ పీ టి సి వేమూరి సురేష్ రంగబాబు, రాష్ట్ర ఎస్ ఎఫ్ సి డైరెక్టర్ కారుమంచి .కామేశ్వరరావు, మధుసూదన్ రావు, చిన బాబు ,పీ ఏ సీ ఎస్ అధ్యక్షులు డి. రమేష్ , తలుపుల వెంకట కృష్ణారావు, , ఎం .రాజ బాబు, పెడన మూడో వార్డు కౌన్సిలర్ బళ్ల. గంగయ్య , సర్పంచ్ బి. సాంబశివయ్య , డిప్యూటీ ఈఈ కే. రామకృష్ణ ఏఈ ఎం .రమేష్ కుమార్, ఎంపీటీసీ పిట్ల .రామిరెడ్డి, పీఏసీఎస్ మెంబర్ శివపార్వతి, రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ సజావుగా నిర్వహించాలి

విశాలాంధ్ర, మచిలీప ట్నం: ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం సక్రమంగా నిర్వహిం చటానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ప్రతి శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపైన్ నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్స్ ఆఫీసర్స్ ఈనెల 19, 20, డిసెంబర్ 3, 4వ తేదీల్లో ప్రతి పోలింగ్‌స్టేషన్ల వద్ద ప్రత్యేక క్యాంపులు చేపట్టాలన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి సాయంత్రం 6గంటలకు రిపోర్టును సమర్పించాలన్నారు.మార్పులు, చేర్పులు, అభ్యంతరాలను స్వీకరించడానికి వారి పోలింగ్‌స్టేషన్లలో సరిపడా సంఖ్యలో 6, 6బి, 7, 8 ఫారాలతో పాటు డ్రాఫ్ట్ ఫొటో ఎలక్టోరల్ రోల్‌ను కలిగి ఉదయం 10నుండి సాయంత్రం 5గంటల వరకు బూత్‌లెవెల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండే విధంగా ఈఆర్వోలు, ఏఈఆర్వోలు చూడాలన్నారు. పోలింగ్‌స్టేషన్లలో బూత్‌లెవెల్ ఆఫీసర్ల హాజరును ఈఆర్వోలు తనిఖీ చేయాలన్నారు. అలసత్వం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

డిసెంబర్ 21న పోర్టు పనులు ప్రారంభించే యోచన: ఎంపీ

విశాలాంధ్ర, మచిలీపట్నం: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పుట్టినరోజు డిసెంబర్ 21న బందరు పోర్టు పనులు ప్రారంశించే యోచనలో ఉన్నట్లు మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి తెలిపారు. బందరు పోర్టు నిర్మాణానికి కేంద్రప్రభుత్వం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.3941 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. పోర్టు పనులు ప్రారంభించిన తరువాత రెండున్నర సంవత్సరాలలో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పోర్టు నిర్మాణం పూర్తయ్యాక స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మచిలీపట్నం పరిసర ప్రాంత యువకులు ఉపాధి కోసం వలస వెళ్ళవలసిన అవసరం ఉండదన్నారు. ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిని ఆరులైన్ల రోడ్డుగా విస్తరించేందుకు కేంద్రప్రభుత్వం అంగీకరించిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి కటౌట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ఘటనపై మాట్లాడుతూ ఇది పిరికిపందల చర్యగా అభివర్ణించారు. సమావేశంలో వైసిపి నాయకులు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-పమిడిముక్కల: గత వారం రోజులుగా 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శాఖా గ్రంథాలయాలైన పమిడిముక్కల,అగినపర్రు, కపిలేశ్వరపురం,మేడూరు,పెనుమత్స లలో ఘనంగా నిర్వహించారు. శనివారం వారోత్సవాలు ముగింపు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన డ్రాయింగ్ రంగవల్లులు క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బి.శ్రీనివాసరావు, వి.ప్రతాప్, బొబ్బా లావణ్య, .సిహెచ్.సుబ్బారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పమిడిముక్కల: ప్రతి పక్ష నేత చంద్రబాబు విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ఆయన కి ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. శనివారం మంటాడ లో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి పై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఇదే నా ఆఖరి ఎన్నికల పోటీ అని చెప్పి మరల ముఖ్యమంత్రి పదవి కోసం పాకులాడుతున్నారని విమర్శించారు.

ఉప్పెన మృతులకు నివాళి

విశాలాంధ్ర- అవనిగడ్డ: దివిసీమ ఉప్పెన మృతులకు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ఘనంగా నివాళులు అర్పించారు.దివి సీమ ఉప్పెన సంభవించిన రోజు పురస్కరించుకొని దివిసీమ పునర్నిర్మాత మండలి వెంకట కృష్ణా రావు విగ్రహానికి నివాళులు అర్పించి ఆనాటి పరిస్థితులు నెమరు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన సినీ నటుడు కృష్ణ, తన గురువు జీఎం కొండయ్య చిత్రపటాలకు మండలి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మెత్తి శ్రీనివాసరావు,గుడిసేవ కృష్ణ ప్రసాద్, కోనపురెడ్డి చంద్రశేఖర్ మాస్టారు మండల రామ్మోహన్రావు తదితరులు పాల్గొని ఉప్పెన మృతులకు సంతాపంగా మౌనం పాటించి నివాళులు అర్పించారు.

మొవ్వ మండలంలో గ్రామదర్శిని

విశాలాంధ్ర, కూచిపూడి: మొవ్వ మండలంలో శనివారం మూడు మైనర్ పంచాయతీలలో గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయుల టీచింగ్ నోట్స్, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు మధ్యాహ్న భోజన పథకాల నిర్వహణపై, జగనన్న గోరుముద్ద పరిశీలన, మెనూ ప్రకారం పిల్లలకి అందజేస్తున్న పదార్థాల వివరాలు, వైయస్సార్ పింఛన్ పంపిణీలపై ఆరా, రేషన్ పంపిణీ, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో పంపిణీ చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పరిశీలన లాంటి కార్యక్రమాలను కొనసాగించి నివేదికలు ఉన్నతాధికారులకు తెలియపరచనున్నారు. అవురిపూడి గ్రామాన్ని గుడివాడ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ దగాని సాంబశివరావు, మొవ్వపాలెంలో ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులను కె .ఆర్. ఆర్. సి. డిప్యూటీ కలెక్టర్ బి శివ నారాయణ రెడ్డి, గూడపాడు గ్రామాన్ని ఏపీఎస్ఆర్టీసీ డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్. జి, నాగేశ్వరరావు పరిశీలించారు. సచివాలయాల సిబ్బంది, పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్, రంగవల్లుల పోటీలు

విశాలాంధ్ర, కూచి పూడి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మొవ్వ తృతీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలోఆరవ రోజైన శనివారం పాఠశాల విద్యార్థులకు క్రాఫ్ట్ పోటీలు, అంగన్వాడి సిబ్బందికి రంగవల్లు పోటీలు నిర్వహించారు. భారత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణీ తూములూరి కృష్ణకుమారి, అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మండవ కోటేశ్వరరావు, కే, నాగేశ్వరరావులతో పాటు క్రాఫ్ట్ టీచర్, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

ఏఎస్ఐ మృతి

విశాలాంధ్ర- పెడన : గుడివాడ ఈవిఆర్ హాస్పిటల్ లో పెడన ఏఎస్సై జె వెంకటేశ్వరరావు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 1983 బ్యాచ్‌కు చెందినవారు. గత సంవత్సర కాలంగా పెడన పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. పెడన ఎస్సై రవిచంద్ర కుమార్ , సిబ్బంది ఏఎస్సై భౌతికయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కంభంపాటి విజయలక్ష్మి మృతి

విశాలాంధ్ర- గన్నవరం: ఉయ్యూరు, గన్నవరం నియోజకవర్గాల ఏరియా సీపీఐ మాజీ కార్యదర్శిలుగా పని చేసిన కంభంపాటి రాంబ్రమ్మం, కంభంపాటి వెంకటరత్నం సోదరుడు కంభంపాటి బుచ్చి నాగయ్య భార్య విజయలక్ష్మి 70 శుక్రవారం రాత్రి అనారోగ్యంతో చనిపోయారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఒక్క ముమార్తె ఉన్నారు. ఆమె భౌతిక కాయాన్ని గన్నవారాం సీపీఐ కార్యదర్శి పెద్దు వివాసుదేవరవు రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ముక్కమాల ఉమా మహేశ్వరవు, కార్యవర్గ సభ్యులు విజయరావు, మోహన్ రావు, గ్రామ ప్రముఖులు డీఎస్ పి నాదెండ్ల మురళి కృష్ణ, మద్దినేని కొటేశ్వరవు,గుర్రం చెంచయ్య,గొంది నరేంద్ర, కృష్ణారావు, మాజీ కార్యదర్శి కొండ విరస్వామి నివాళులు అర్పించారు.

మహిళా సాధికారతకు గ్రంథాలయాలు దోహదం

విశాలాంధ్ర -చల్లపల్లి: మహిళా సాధికారతకు గ్రంథాలయాలు దోహద పడతాయని సచివాలయం మహిళా పోలీస్ లావణ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చల్లపల్లి శాఖ గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్, క్లాసికల్ డాన్స్, చిత్రలేఖ రంగవల్లి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.గ్రంథాలయ అధికారి కే. గణేష్ కుమార్ పర్యవేక్షించారు. ఆధార్చ శిభిరం

ప్రత్యేక ఆధార్ శిబిరాలు

విశాలాంధ్ర -చల్లపల్లి: గ్రామ సచివాలయం-1లో శనివారం మొబైల్ ఆధార్ శిబిరం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హులైన లబ్ధిదారులు ఆధార్ ఈ కేవైసీ కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చల్లపల్లి పంచాయతీ ఈఓ పడమట సుకుమార్ తెలిపారు. ఆధార్ డేటాలో వేలిముద్రలు, ఫోన్ నెంబర్లు యాడ్ చేసుకోవలసిన ఈ ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దిశ చట్టంపై అవగాహన

విశాలాంధ్ర, మచిలీపట్నం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని గ్రేడ్-2 గ్రంథాలయంలో శనివారం దిశ చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎ.పద్మ విద్యార్థులకు దిశ చట్టం గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన రంగవల్లుల పోటీలకు వై.లక్ష్మి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. గ్రంథాలయాధికారి డి.వి.నాగరవి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది, ఎల్.విజయలక్ష్మి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర- పెదపారుపూడి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మండలంలోని పెదపారుపూడి, ఎలమర్రు, వెంట్రప్రగడ, గ్రంథాలయాలలో మాజీ ప్రధానమంత్రి, ప్రపంచ దేశాల అధ్యక్షురాలు, ఇందిరాగాంధీ చిత్రపటాలకు ఆయా గ్రంథాలయ అధికారులు ఎం వి ఎస్. లక్ష్మి, జె. విజయలక్ష్మి, కె. నాగరాజుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమలాపూర్ణమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భారత దేశ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అటువంటి మహానాయకురాలు జయంతిని మహిళా దినోత్సవంగా జరుపుకోవడం గర్వించదగ్గ విషయమని ఆమె అన్నారు. మహిళా సాధికారత, దిశ చట్టం గురించి అవగాహన శనివారం కల్పించారు. అనంతరం ఆయా గ్రంథాలయాలలో రంగవల్లి కార్యక్రమంలో మహిళలచే ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళ...

విశాలాంధ్ర- అవనిగడ్డ: అవనిగడ ఉక్కు మహిళగా పేరు పొంది భారతదేశంలో నాలుగు సార్లు ప్రధానమంత్రిగా సేవలందించిన ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక రాజీవ్ గాంధీ సెంటర్లో మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిడ్ల వీర రాఘవులు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇందిరాగాంధీ చేసిన సేవలను కొనియాడారు అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు షేక్ గౌస్ అవనిగడ్డ రజనీకాంత్ గొల్ల ఏడుకొండలు రామాల పోతురాజు కాగితాల సుదర్శన్ భీమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి....



విధాలాంధ్ర - చల్లపల్లి : భారత దేశ తొలి(ఏకైక) మహిళా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని చల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. వార్డు సభ్యుడు మీర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నేతలు..అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జగ్గారపు బాబూరావు, పరిసే ప్రసాద్, కొండేటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. దేశానికి ఇందిర చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - జగ్గయ్యపేట: పట్టణంలోని దుర్గాపురం ప్రభుత్వ పాఠశాలలో రూ.12 లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శనివారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పిల్లలందరూ మంచి చదువులు చదవాలని ప్రపంచ స్థాయిలో పోటీ పడాలన్నది మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంకల్పం అని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్మోహన్ రెడ్డి నాడు నేడు కార్యక్రమాన్ని చేపట్టి బడుల రూపు రేఖలు మారుస్తున్నారని తెలిపారు. పూసల పుల్లారావు, ఆవాల భవాని ప్రసాద్,ప్రిన్సిపల్ కల్పన పాల్గొన్నారు.

ఊర చెరువు అభివృద్ధికి ప్రణాళిక

విశాలాంధ్ర - జగ్గయ్యపేట: స్థానిక ఊరచెరువును శనివారం ఏపీ టూరిజం అధికారులు శ్రీనివాస్, ఆ శాఖ డిప్యూటీ సిఈఓ రాముడుతో కలిసి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికై ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, బోటింగ్, లైటింగ్ మొక్కలు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. నెహ్రూ చౌక్ నందు ఒక మంచి ఫౌంటెన్,మిని పార్క్ ఏర్పాటు చేయడం జరుగుతుంది అని అన్నారు. పట్టణంలో ఇప్పటికే అన్నిచోట్ల డ్రైనేజీలు,సిసి రోడ్లు వీధిలైట్లు స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగుతుందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ కొలగాని రాము, మున్సిపల్ డి ఈ శివ కోటేశ్వర రావు, టౌన్ సర్వేయర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి

విశాలాంధ్ర- గంపలగూడెం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఎంపీడీవో ఎర్రమల పిచ్చి రెడ్డి టాయిలెట్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశు భ్రతను పాటించాలన్నారు. గ్రామపంచాయతీ ఈవో జి శ్రీనివాసరెడ్డి సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యాలయం నుండి హై స్కూల్ దగ్గర వరకు స్వచ్ఛతా రన్ ర్యాలీని విద్యార్థులతో నిర్వహించారు. సర్పంచ్ కోట పుల్లమ్మ, పి హరి కృష్ణ , ముని లక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముండ్లపాడులో శంకుస్థాపనలు

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : మండలం లోని ముండ్ల పాడు గ్రామం లో శనివారం అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఉదయభాను మాట్లాడుతూ ముండ్లపాడు గ్రామంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేయడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. ముండ్లపాడు గ్రామంలో నాడు-నేడు లో భాగంగా కోటి ఐదు లక్షల రూపాయలతో అదనపు తరగతి గదులు మౌలిక వసతులకు శంకుస్థాపన చేయడం అదేవిధంగా రాకేం ఫార్మా లిమిటెడ్ వారి సహకారంతో నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని ఏర్పాటు ప్రారంభించడం అదేవిధంగా రైతన్నలకు ఉపయోగపడే నూతన సొసైటీ భవనం శంకుస్థాపన చేసుకోవడం 30 లక్షల రూపాయలతో జలజీవన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయడం ఇలాంటి బహుత్కర కార్యక్రమాలు చేపట్టడం గ్రామప్రజలు అదృష్టమని అన్నారు,అటు ప్రభుత్వ సహకారాన్ని ఇటు పారిశ్రామికవేత్తల సహకారాన్ని పొందుతూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని సదుద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు,రాకేం ఫార్మ లిమిటెడ్ వారి సహకారాన్ని ఎన్నడూ మర్చిపోలేదని తెలిపారు,అదేవిధంగా ప్యారామౌంటు సురేష్ సేవలు అమోఘమని కొనియాడారు. నియోవర్గంలో ఏ సేవలు చేయాలన్నా సురేష్ ముందు ఉంటారు అని తెలిపారు,మాజీ ఎంపీపీ గూడపాటి. శ్రీనివాసర రావు.ముండ్లపాడు గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడపాలనే మంచి ఆలచనతో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. రాకేం ఫార్మా లిమిటెడ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి, ప్యారామౌంట్ అధినేత సురేష్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు , సర్పంచ్ గూడపాటి.లావణ్య, ఎంపీపీ మార్కాపూడి. గాంధీ ఉపా ధ్యక్షులు గుంటుపల్లి. వాసు. కనగాల. శ్రీనివాసరరావు. సొసైటీ అధ్యక్షులు,గుడపాటి. రవి. వివిధ గ్రామాల సర్పంచులు,గ్రామ ముఖ్య నాయకులు,పాఠశాల హెచ్ఎం లు మరియు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ విద్యా పథకాలు వర్తింపచేయాలి



విశాలాంధ్ర- కంచికచర్ల: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన విద్యార్థులందరికీ విద్యా పథకాలు వర్తింపచేయాలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమే శ్వరరావు కోరారు. కంచికచర్ల మండలం ఏపీఎన్జీవో కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న సమస్యలులపై విద్యార్థిలోకం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించే విద్యా వ్యతిరేక విధానాలను, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు. నందిగామ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు కళాశాల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజులు బకాయిలు విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కృష్ణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పీజీ పరీక్ష పేపర్ వాల్యుయేషన్ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను కోరారు.ఎస్ఎఫ్ఐ కంచికచర్ల మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ ఎఫ్ ఐ మండల అధ్యక్షుడుగా సన్నీ, కార్యదర్శిగా బాషా ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షులుగా ప్రజ్వల్, అరవిందు, యశ్వంత్, వంశీకృష్ణ లు ఎన్నిక అయ్యారు.మండల సహాయ కార్యదర్శి లుగా రసూల్, వంశీ, నరసింహారావు, భావనలు, మండల కమిటీ సభ్యులుగా రవి కిరణ్, ప్రశాంత్, స్వర్ణ జ్యోతి, రమ్య, శివ కుమార్, కృష్ణప్రియ లతో మొత్తం 16 మందితో నూతన మండల కమిటీ ఏర్పాటు చేసారు. ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, నందిగామ డివిజన్ కార్యదర్శి గోపి నాయక్, మహిళా కన్వీనర్ జాహిద, మండల్ నాయకులు, వివిధ కళాశాల, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రక్రియను పూర్తి చేయండి



విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : పద్మావతి ఘాట్ నుండి కనకదుర్గమ్మ వారధి వరకు నిర్మించనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి శంకుస్థాపనకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. కృష్ణానది వెంబడి కరకట్టవాసులకు రక్షణగా మూడవ దశలో నిర్మించే రిటైనింగ్ వాల్కు టెండర్లు, శంకుస్థాపన పనులు చేపట్టేందుకు స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి శనివారం కలెక్టర్, నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్లతో కలసి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది వరద ముంపు నుండి శాశ్వత పరిష్కార దిశగా పద్మావతి ఘాట్, కనకదుర్గా వారధి మధ్య కృష్ణానది వెంబడి 1.05 కిలో మీటర్లు పొడవున రూ.137.85 కోట్లతో రిటైనింగ్ వాల్ మూడో దశ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువన దాదాపు 50,000 మంది ప్రజలు నివసిస్తున్నారని గత కొన్నేళ్లుగా ప్రకాశం బ్యారేజీ నుంచి మిగులు జలాలను విడుదల చేయడంతో చలసాని నగర్, కృష్ణలంక, గీతానగర్, రాణిగారితోట, బాలాజీ నగర్, ద్వారకా నగర్, భ్రమరాంబపురం లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురువుతున్నాయన్నారు. కోటినగర్ నుండి యనమలకుదురు మధ్య 2.2 కిలో మీటర్ల పొడవున మొదటి దశ, కనకదుర్గమ్మ వారది నుండి కోటి నగర్ వరకు 1.2 కిలో మీటర్ల పొడవున రూ.122.90 కోట్లతో రెండవ దశలో రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. మూడవ దశ రిటైనింగ్ వాల్ పూర్తి అయితే కృష్ణలంకలోని రణదీవ్ నగర్, గౌతమినగర్, నెహ్రూ నగర్, ద్వారక నగర్లో నివసిస్తున్న 30 వేల మంది జనాభాకు వరద ముంపు నుండి రక్షణ కలుగుతుందన్నారు.

జీవో 52 ఉపసంహరించండి

గిరిజన ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగే విధంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో 52ను తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో డిసెంబర్ 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టాలని గిరిజన ఐక్య కార్యచరణ కమిటీ తీర్మానం చేసింది. స్థానిక ప్రెస్క్లబ్లో శనివారం గిరిజన సంఘాల ఐక్య కార్యా చరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సభకు గిరిజన ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్లి భాస్కరరావు, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడా రమేష్,ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సంక్షేమ సేవ సంఘం అధ్యక్షులు కుంభ రాంబాబు,యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుడుముల రామచంద్రయ్య మాట్లాడుతూ, బోయ, బెంతో ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జీవో 52 విడుదల చేసి, రిటైడ్ ఐఎఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ కుమార్తో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. 40 లక్షల జనాభా ఉన్న బోయలను ఎస్టీ జాబితాలలో చేర్చితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 32లక్షల మంది అమాయక గిరిజనలకు తీవ్ర అన్యాయం జరుగుతుంద న్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అన్ని విధాలుగా అభివృద్ధి చెంది బీసీ-ఎ జాబితాలో ఉన్న బోయలను ఎస్టీ జాబితాలలో ఎలా చేర్చుతారు అని ప్రశ్నించారు. ఏ కులానైనా ఎస్టీ జాబితాలలో చేర్చాలంటే వారి సంస్కృతి,భాష, ఆహారపు అలవాట్లు, వారి సామాజిక పరిస్థితి అంశాలను పరిశీలించవలసి ఉంటుందన్నారు. రాజకీయ స్వలాభం కోసం అమాయక గిరిజనలను బలి పశువు చేయవద్దన్నారు.

గత రెండు ఎన్నికలలో రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో గిరిజన ప్రజలు ఏకపక్షంగా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికి మద్దతు పలికిన విషయాన్ని మరవొద్దు అన్నారు. బోయ, బెంతో ఒరియా కూలాలను ఎస్టీ జాబితాలో చేర్చాలి అనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్.టి.ఎఫ్ అధ్యక్షులు మానిపాటి నవీన్చంద్ర నాయక్ కళావతి, కో-ఆర్డినేటర్ బొజ్జగాని రామస్వామి, బి.వెంకటరమణ నాయక్, రామ్మూర్తి నాయక్, తీగల చంద్రశేఖర్, కృష్ణా నాయక్, చక్రి నాయక్, విష్ణు నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, కేస పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించండి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ముస్లీంలు అనేకరంగాల్లో ఎంతో వెనుకబడి ఉన్నారని వారికి విద్య,ఉద్యోగ, రాజకీయ రంగాల్లో దేశవ్యాప్తంగా 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 16న ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద ధరాన చేపట్టి ప్రధాని మోదీకి మెమోరాండం అందించటం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు అబ్దుల్ ఆసీమ్ ఫీర్ దేశాయ్ తెలిపారు. గాంధీనగర్ ప్రెస్క్లబ్లో శనివారం పార్టీ పటిష్టపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ ప్రజలను,ప్రతి పక్ష నాయకలను వేధింపులకు గురిచేస్తున్న జగన్మోహన్రెడ్డి ప్రభుత్వాన్ని తక్షణం గద్దె దించాలని అందుకు కలసి వచ్చే అన్ని పార్టీలను కలుపుకుని రాబోవు ఎన్నికల్లో ఓట్లు చీలకుండా కృషి చేయాలన్నారు.

వైసిపి, టిడిపిలు ముస్లింలను ఓటు బ్యాంకు గానే ఉపయోగించుకుని వారి సామాజిక వర్గాలకు మాత్రమే ప్రయోజనాలు కాపాడుతుందన్నారు. ఈపార్టీలకు ఓట్లు వేసే బదులు బిజెపి వేయాలని, ముస్లీం,బీసీ,కాపు వర్గాలకు అండగా ఉండే జనసేన పార్టీకి మద్దుతు తెలపాలన్నారు. ముస్లీంల ప్రయోజ నాలు కాపాడాలని కోరుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్దనిర్వహించే ధర్నా విజయవంతం

చేయాలని పిలుపు నిచ్చారు.

షేక్ జలీల్, కాజీ అహ్మద్ ఫైజల్ సిద్దీకి,సయ్యద్ అంజాద్ ఖాదీర్,ఖాజీ అజామ్ ముక్తధీర్ సిద్దీకి, డాక్టర్ తస్వమ్ ఇమామ్, కాజీ సయ్యద్ మైనుద్దీన్, నాజీర్ అహ్మద్,కాజీ హనీఫ్ జమాల్ ఉద్దీన్,షేక్ మునాఫ్,మస్తాన్ వల్లీ,బాషా తదితరులు పాల్గొన్నారు.

యూటీఎస్ యాప్ ద్వారా రైలు టికెట్ కొనుగోలు విస్తృతం చేయాలి



విశాలాంధ్ర,విజయ వాడ (గాంధీనగర్) : యూటీఎస్ యాప్ ద్వారా రైలు టికెట్ కొనుగోలు విషయంలో నూతనంగా వచ్చిన అప్డేట్ల గురించి ప్రయాణీకులకు అవగాహన కల్పించి మరింత విస్తృతంగా ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకొవాలని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జి.జాన్ ప్రసాద్ అధికారులకు సూచించారు. నర్సాపూర్-పాలకొల్లు స్టేషన్లో శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రయాణీకుల సౌకర్యాలను సమీక్షించారు. టీటీఈ రెస్ట్ రూమ్, బుకింగ్ ఆఫీస్, సర్క్యులేటింగ్ ఏరియా, క్యాటరింగ్ స్టాల్స్, పార్శిల్ ఆఫీసులను ఆయన పరిశీలించారు. పెండింగ్లో ఉన్న బ్రాంచ్ లైన్ డబ్లింగ్, స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. నర్సాపురంలో ప్రయాణీకుల ట్రాఫిక్ను మెరుగుపరచడానికి తీసుకోవలసిని మార్గాలను రూపొందించాలని సూచించారు. అనంతరం ఎటివిఎమ్ మెషీన్ల పని తీరును పరిశీలించారు. అనంతరం యు.టి.ఎఫ్ యాప్ పని తీరుపై ప్రయాణికులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఎసిఎమ్ వి.రవివర్మ,సీనియర్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ పి.శివ ప్రసాద్, సిహెచ్.దివాకర్ బాబు,టి.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

మానవ వికాసానికి పుస్తక పఠనం అవశ్యం

హైకోర్టు న్యాయమూర్తి కృష్ణ మోహన్

విశాలాంధ్ర-విజయవాడ: మానవ వికాసానికి, క్రమశిక్షణకు, అధ్యయనానికి భాషాభివృద్ధికి పుస్తక పఠనం ఆవశ్యకత ఉందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బి కృష్ణమోహన్ ఉద్ఘాటించారు. 55 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం బెంజిసర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయం నందు నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పుస్తక పఠనం పుస్తక పఠనం,డ్రాయింగ్, క్విజ్ పోటీల విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. చదువుతో పాటుగా క్రీడలు సాంస్కృతిక రంగాల్లో రాణించాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షులు చంద్ర శేఖర కల్కుర మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అన్నింటిలో మనదేశ రాజ్యాంగం ఎంతో గొప్పదని వివరించారు. డోకిపర్తి శంకర్రావు, రావి శారద , కామినేని పట్టాభి రామయ్య , వి .కృష్ణ కుమారి, వి. కేశవరావు, గ్రంథాలయ కమిటీ సభ్యులు శివశంకర్, జీ సుమ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

మున్నేరులో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

విహారయాత్రలో విషాదం

విశాలాంధ్ర- పెనుగంచిప్రోలు : ఉదయం నుంచి సరదాగా గడుపుతున్న విద్యార్థులు ఒక్కసారిగా విషాదంలో మునిగారు. అప్పటివరకు తమతో ఆటలాడుతున్న ఆ విద్యార్థులు ఒక్కసారిగా నీటిలో మునిగి చనిపోయారని తెలియడంతో తోటి విద్యార్థులు బోరున విలపించారు. ఖమ్మం జిల్లా మధిర మండలం మడుపల్లి గ్రామం సరస్వతీ విద్యాలయంకు చెందిన సుమారు 80 మంది విద్యార్థులు శనివారం పెనుగంచిప్రోలు మున్నేరు ఒడ్డున ఉన్న మామిడి తోటలోకి పిక్నిక్ కోసం వచ్చారు. ఉదయాన్నే వచ్చిన విద్యార్థులు, వారితో వచ్చిన ఉపాధ్యాయులు ఆటపాటలతో సరదాగా గడిపారు. సాయంత్రం నాలుగున్నర సమయంలో మున్నేరులోని మడుగులోకి నలుగురి విద్యార్థులు స్నానం చేసేందుకు దిగారు. వారిలో శీలం నర్సిరెడ్డి(12) ఆరో తరగతి, నీలం జస్వంత్ (10) నాలుగో తరగతి విద్యార్థులు నీటిలో మునిగిపోయి గల్లంతయ్యారు.

ఈ విషయాన్ని గమనించిన ఉపాధ్యాయులు నీటిలో మునిగిన మరో ఇద్దరిని అతి కష్టం మీద బయటకు తీశారు. మిగిలిన ఇద్దరు మృతి చెందారు. దగ్గర్లో చేపలు పడుతున్న జాలర్లు వచ్చి మృదేహాలను బయటకు తీశారు. విషాద వార్త మడుపల్లి వాసులకు తెలియడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతిలోనయ్యారు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని. ఉదయభాను ఎస్ఐ,హరి ప్రసాద్ కుఫోన్ ద్వారా తెలుపగా ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు వాసవి క్లబ్స్ వార్షిక సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 4వ వార్షిక సమావేశం ఆదివారం నగరంలో నిర్వహించనున్నట్లు క్లబ్ జిల్లా గవర్నర్ గద్దం పవన్ కుమార్ తెలిపారు. లబ్బీపేట లోని ఒక హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వార్షిక సమావేశం కు సంబంధించిన పోస్టర్ ను క్లబ్ ప్రతినిధులు ఆవిష్కరించారు.

బాక్సింగ్‌లో జాతీయస్థాయి ప్రతిభ

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: బాక్సింగలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయస్థాయిలో ప్రతిభను కనబరిచారని స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జి.జాన్సన్ దేవరాజ్ తెలిపారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన సవాతే(ఫ్రెంచ్ బాక్సింగ్) పోటీల్లో తమ విద్యార్థి ధారావత్తు మణికంఠస్వామి ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించినట్టు తెలిపారు. ద్వితీయస్థానం సొంతం చేసుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా మణికంఠస్వామి, అతని తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

స్వచ్ఛతా ర్యాలీ

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: స్థానిక గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు శనివారం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. గిరిజన సమరయోధుడు బిర్సా ముండా జయంతి ఉత్సవాలు, ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఈ ప్రదర్శన చేసినట్లు ప్రిన్సిపల్ జి.జాన్సన్ దేవరాజ్ తెలిపారు. విద్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రదర్శన కొనసాగింది.

50 మందికి వైద్యసేవలు

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: లయన్స్క్లబ్, సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు కామినేని శ్రీనివాస్ 50మంది రోగులకు సేవలందించారు. డా.అచ్యుతబాబు ఆధ్వర్యంలో గుండె, ఈసీజీ తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు.సేవాసంస్థ నిర్వాహకుడు జె.రంగారెడ్డి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహనరెడ్డి, అరుణ, సీనియర్ సభ్యులు పల్లిపాం లక్ష్మయ్య, కుక్కడపు చక్రధరరావు, మద్దు మధుసూధనరావు, జీవీ.నాగేశ్వరరావు, పెనుగొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు లేని సమాజాన్ని నిర్మిద్దాం



విశాలాంధ్ర,విజయ వాడ (గాంధీనగర్) : బాలలపై వేధింపులు లేని సమాజాన్ని నిర్మిద్దాం అని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ చైల్డ్ లైన్-1098 డైరెక్టర్ బి.ఎస్.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు.బాలల హక్కుల చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాలలో భాగంగా శనివారం సిద్దార్థ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో " బాలలహక్కుల పరిరక్షణకై చైల్డ్ లైన్-1098,ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, పి.బి సిద్ధార్థా యన్.ఎస్.ఎస్ యూనిట్ ,మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖ -చైల్డ్ వెల్ఫేర్ కమిటి (సిడబ్ల్యూసి), సచివాలయ మహిళా పోలీసు తదితర ప్రభుత్వ- స్వచ్ఛంద సంస్థల అధ్వర్యంలో పసి మొగ్గలపై పైశాచికం లేని సమాజాన్ని నిర్మిదాం.అందులో యువత పాత్ర కీలకంలి అనే అంశముపై సదస్సు నిర్వహించారు. బాలలపై వేధింపులు లేని సమాజాన్ని నిర్మించడంలో యువత పాత్ర కీలకం అన్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు చంద్రగిరి. రాధాకుమారిలి మాట్లడుతూ బాలలు అవగహన లేక చెడు అలవాట్లుకు లోనవడం వల్ల తప్పులు చేయడం జరుగుతుందన్నారు. చైల్డ్ లైన్ -1098 జిల్లా అరవ రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ వారోత్సవాలలో బాలలపై వేధింపులు నివారణలో, మత్తుపదార్థల నివారణ , బాల్య వివాహలకు వ్యతిరేకంగా,అవగాహనా చైతన్య కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. లిబర్టీ సంస్థ సెక్రటరీ కోటి. ప్రకాష్,దిశ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ప్రేమలత, ఏ.ఎస్.ఐ టీ. శివ కుమారి,సచివాలయం మహిళా పోలీస్ జిల్లా కోఆర్డినేటర్ యన్. నీలా శాంతి, కళాశాల యన్.ఎస్. ఎస్ లెక్చరర్ శ్రీనివాస రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుల అరెస్టు



విశాలాంధ్ర- కంచికచర్ల: ఒరిస్సా నుండి ముంబైకి గంజాయి రవాణా చేస్తున్న కేసుకు సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు ఏ సీ పీ నాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఏ సీ పీ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ సీ పీ మాట్లాడుతూ శుక్రవారం ఒరిస్సా రాష్ట్రం చిత్రకొండ గ్రామం లో మోహన్ అను వ్యక్తీ వద్ద గంజాయిని కొని మహారాష్ట్ర థానే జిల్లా లోకమాన్య నగర్ కు చెందిన గణపతి అలియాస్ అజయ్ అను వ్యక్తీ కి తీసుకొని వెళ్తుండగా, గ్రామీణ సిఐ ఐవి నాగేంద్ర కుమార్, యస్ఐ పివియస్ సుబ్రహ్మణ్యంలు వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు కార్లలో నాలుగు మూటలలో రవాణా అవుతున్న 102 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పేద విద్యార్థులకు సహాయమే లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : పేద విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు రౌండ్ టేబుల్ ఇండియా ఎంతగానో కృషి చేస్తోందని అధ్యక్షులు జి.శ్రీహర్ష తెలిపారు. శనివారం లబ్బీపేట లోని రౌండ్ టేబుల్ ఇండియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంస్థ అధ్యక్షులు జి.శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అయినా తరగతి గదులు లైబ్రరీ టాయిలెట్ నిర్మాణానికి రౌండ్ టేబుల్ ఇండియా ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. తమ సంస్థ 136 నగరాలలో పనిచేస్తోందని ఇప్పటివరకు 7,940 తరగతి గదులు నిర్మించామని వెల్లడించారు. రౌండ్ టేబుల్ ఇండియా విద్య వైద్యం ఆరోగ్యం కు ప్రాధాన్యత ఇస్తుందని, పేద విద్యార్థులు విద్య అభ్యసించేందుకు ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. నగరంలోని రామలింగేశ్వర నగర్ లో ఒక పాఠశాల నిర్మించామనిపేర్కొన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రశాంతి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన డాన్స్ తంబోలా పేరుతో కార్యక్రమం నిర్వహించి వచ్చే ఆదాయంతో సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సంస్థ ప్రతినిధి కాట్రగడ్డ మోహన్, రౌండ్ టేబుల్ ఇండియా విజయవాడ చాప్టర్ 68 చైర్మన్ డాక్టర్. గుత్తికొండ హర్ష, చైర్ పర్సన్ డాక్టర్ ప్రశాంతి, నేషనల్ బోర్డ్ మెంబర్ కౌశిక్, సభ్యులు కాట్రగడ్డ మోహన్, ప్రఫుల్, వినయ్, చిత్ర ,వెంకటేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నాల్గొవ అడిషనల్ సీనియర్ జడ్జి రాజారామ్ అన్నారు. విజయవాడ పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రం లో హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధిత కుటుంభ సభ్యులకు "న్యాయ విజ్ఞాన సదస్సు"ను శనివారం ఏర్పాటు చేశారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధిత కుటుంభ సభ్యులు వారు ఎదుర్కొంటున్న సమస్యలు వివిధ చట్టాల అంశాలను న్యాయమూర్తి నివృత్తి చేశారు. అనంతరం నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధిత కుటుంభ సభ్యులు వారు ఎన్నో సమస్యలను చెప్పుకోలేకపోతున్నారని, మానసికంగా ఇబ్బంది పడుతున్నారని వారికీ చట్ట ప్రకారం చెందవలసిన, రావలిసిన అవకాశాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉమ్మడి కృష్ణా జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు మండల న్యాయ సేవాధికార సంస్థ అడ్వకేట్ సి హెచ్ రాధాకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయం అందించాలనే లక్ష్యంతో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు, జోనల్ కోఆర్డినేటర్స్, యఫ్ మమత, డి శ్రీవల్లి, కె ప్రియాంక, వాలంటీర్లు శ్రీనివాస రావు, హైమావతి, రాణి, దుర్గ, మండల న్యాయ సేవాధికార సంస్థ విభాగం సిబ్బంది, మరియు హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధిత కుటుంభ సభ్యులు పాల్గొన్నారు.

డిసెంబర్ 20న తపాలా అదాలత్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా సేవలకు సంబంధించి వినియోగదారుల పిర్యాదులు-సమస్యలు పరిష్కరించు నిమిత్తము డిసెంబర్ 20న రీజనల్ తపాలా అదాలత్ నిర్వహిస్తున్నామని విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ డి.యస్.వి.ఆర్. మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలకు సంబంధించిన పిర్యాదులు-సమస్యలు ఈ అదాలత్ నందు పరిష్కరించబడతాయన్నారు. ఫిర్యాదులు డిసెంబర్ 10 లోగా "తపాలా అదాలత్" శీర్షికతో అసిస్టెంట్ డైరక్టర్ (స్టాఫ్), పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, గాంధీనగర్, విజయవాడ-520003 చిరునామాకు పంపించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్పెషల్ కెంపాయిన్ డేలో భాగంగా 80- సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వార్డ్ నెంబర్ 24 సూర్యరావుపేట కర్నాటి రామమోహన్రావ్ మునిసిపల్ హై స్కూల్లో ఉన్న 151 నుండి 161 వరకు ఉన్న పోలింగ్ బూత్ 11 స్టేషన్లను నగర పాలక సంస్థ కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80- సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ నెంబర్ తప్పని సరిగా చూపించాలని, ప్రతి బి.యల్.ఓకి సంబందించిన పోలింగ్ కేంద్రంలోని ఓటర్ల రేషియోని తప్పినసరిగా తెలుసుకోవాలని, లొకేషన్ మ్యాప్ వారివద్ద ఉండాలని, 18 సంవత్సరాల వయస్సు వారిని కొత్త వోటర్లుగా నమోదు చేయాలని సూచించారు. కొత్త వోటర్ల నమోదు గురించి బ్యానర్ని పోలింగ్ లొకేషన్లో ఏర్పాటు చేయాల్సిందిగా తెలిపారు. ఫారం 6, 7, 8 గురించి బి.యల్.ఓల అవగాహనను ఈ సందర్భంగా పరిశీలించారు. 6బి ఫారాలను తప్పనిసరిగా ఓటర్ సంతకంతో తీసుకుని ఫారంలను జాగ్రత్తగా భద్రపర్చాలని ఆదేశించారు.

జక్కంపూడి టిడ్కో గృహాలు...



విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం అధికారులతో కలసి జక్కంపూడి గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వం నిర్మించిన 6576 మంది టిడ్కో గృహాలను లబ్దిదారులకు కేటాయించటం జరిగిందని తెలిపారు. ఇందులో 300 స్క్వేర్‌పీట్ 1152, 365 స్క్వేర్‌పీట్ 1632, 430 స్క్వేర్‌పీట్ 3792 ఫ్లాట్స్ కేటాయించినట్లు తెలిపారు. వీటిలో పూర్తిగా నిర్మించిన 1680 ఫ్లాట్స్‌ను నగర పాలక సంస్థ సిద్ధం చేసినట్లు చెప్పారు. మిగిలిన గృహ నిర్మాణాలను అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం గ్రీనరి పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా అకర్షణీయమైన మొక్కలు ఏర్పాటు చేయాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన 200 మొక్కలను కమీషనర్ ఈ సందర్భంగా నాటారు.

రోడ్ అభివృద్ధికి ప్రణాళికలు...

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : కృష్ణలంకలోని రాణిగారితోట, రామలింగేశ్వర నగర్ ప్రాంతాల్లో నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ విధానంలో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ 15వ డివిజన్‌లోని రామలింగేశ్వర నగర్ ప్రాంతంలోని రిటైనింగ్ వాల్ ప్రక్కన 20 ఎం.ఎల్.డి సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద రోడ్ అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలనీ అధికారులను ఆదేశించారు. డ్రెయిన్ నిర్మాణానికి రోడ్డు మార్జిన్ ప్రణాళికలను సిద్ధం చేయాలని, అక్కడ ఉన్నటువంటి ఇళ్ళులన్నింటిని సర్వే చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(పార్క్స్)ను ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.చంద్రశేఖర్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : ప్రపంచ మరుగుదొడ్ల దినోచవం సందర్భంగా పెనుగంచిప్రోలు గ్రామం లో హార్ట్ అమలు సహాయక సంస్థ ద్వారా మరుగు దొడ్లు వాడకం ప్రజలకు మరియు గ్రామ పంచాయతీ సభ్యులకు మరుగుదొడ్డి ప్రాధాన్యత మరియు చేతి శుభ్రత పాటించడం గురుంచి చాట్ల.నిరంజ న్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలఉపాధ్యాయులు వివరించారు . బాల బాలికలకు హ్యాండ్ వాష్ గురుంచి మరియు మరుగు దొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు శుభ్రత పాటించడం ద్వారా అనారోగ్యాలు రాకుండా అడ్డుకొవచ్చు అని జిల్లా జల్ జీవన్ మిషన్ కోఆర్డినేటర్ రామకృష్ణ వివరించారు. కోఆర్డినేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్ పిల్లలకు హ్యాండ్ వాష్ పద్ధతులు గురుంచి వివరించారు. ప్రపంచ మరుగు దొడ్లు వాడకం మరియు ప్రపంచ వ్యాప్తంగా ఇంకా ఉన్న మరుగుదొడ్లు ఉన్న సంఖ్య ఇంకా నిర్మించవలసిన మరుగుదొడ్లు సంఖ్య సెల్ ఫోన్లు సంఖ్య కంటే తక్కువ ఉన్నాయి. టెక్నాలజీ పరంగా ముందు వరసలో ఉన్న మరుగు దొడ్లు వాడకం లో వెనుకబాటు లో ఉన్నాము..అని వివరించారు

సెక్రెటరీ మాట్లాడుతూ 100 మందికి 99 మందికి మరుగుదొడ్లు ఉన్నాయని వివరించారు. ప్రజల అవగాహన కొరకు రాలీ నిర్వహించడం జరిగిందిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మాకుమారి. పంచాయతీ కార్యదర్శి శ్యామ్ జిల్లా జల్ జీవన్ మిషన్ కోఆర్డినేటర్ రామకృష్ణ మరియు నాగేశ్వర్ రావు మేనేజర్ రామశేష చార్యులు, అంగన్వాడీ టీచర్స్, వాలంటీర్స్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

విశాలాంధ్ర- కంచికచర్ల: భారత మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీ 105 వ జయంతి కార్యక్రమాలు కంచికచర్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. దేశంలో పేద బడుగు బలహీనవర్గాలకు చేసిన సేవలను వారు కొనయాడారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద వజ్రయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వేముల జయరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు కూచిపూడి మోహన్ రావు, వేల్పుల శివకృష్ణ, చందర్లపాడు గ్రామ మాజీ సర్పంచి కస్తాల నాగేశ్వరావు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సూదులు పూర్ణచంద్రరావు, షేక్ నాగల మీరా తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు కూరగాయలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండల పరిధిలోని పెనమత్స గ్రామంలో మహాయోగిని గురువు స్వాతంత్ర సమరయోధుడు దండముడి పూర్ణయ్య చౌదరి 81 వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించి తిరుమలకు 10 టన్నుల కూరకాయలు నిత్య అన్నదాన కి పంపారు. శనివారం పెనుమత్స ఆశ్రమం లో నిర్వహించిన కార్యక్రమంలో దండముడి పూర్ణయ్య చౌదరి చేసిన సేవలు ని వక్తలు గుర్తు చేశారు.ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీజీ తో ఉప్పు సత్యాగ్రహం లో పాల్గొని ఖద్దరు దుస్తులు ధరించి బళ్ళారి జైలు శిక్ష అనుభవించారని మహాయోగిని కి జ్ఞానబోధ చేసిన మొదటి గురువు పూర్ణయ్య చౌదరి ని కుటుంబం సభ్యులు తెలిపారు.అనంతరం మహాన్నదానం చేశారు.ప్రతి సంవత్సరం కుటుంబం సభ్యులు ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పింస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దండమూడి పూర్ణ గాంధీ లక్ష్మణరావు పూర్ణచంద్రరావు కృష్ణమోహన్ మొవ్వ రామచంద్రరావు (రాము) ఆడిటర్ శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిర సేవలు అమోఘం

విశాలాంధ్ర - జగ్గయ్యపేట: స్వర్గీయ ఇందిరా గాంధీ 105వ జయంతి ని శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దాచేపల్లి వీరభద్రరావు ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా నగర్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. భారత దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. సన్నే రామారావు, జహంగీర్ భాష, సయ్యద్ ఖాజా, రేపూరి శీను ,కట్టమూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

విశాలాంధ్ర- అవనిగడ్డ: మహిళలు అన్ని రంగాల్లో మరింత ధైర్యంగా చొరవ తో ముందుండాలని పలువురు వక్తలు కోరారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో శనివారం మహిళా దినోత్సవ సందర్భంగా దిశా చట్టం, మహిళా సాధికారత పై అవగాహన విధిగా కలిగి ఉండాలని సూచించారు. ఎంపీపీ తుంగల సుమతి దేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఈవో పి ఆర్ డి శైలజ కుమారి, కవయిత్రులు సింహాద్రి పద్మ దేవి ఝాన్సీ పి జయలక్ష్మి లు ప్రసంగించారు. తొలత దివంగత ఇందిరాగాంధీ చిత్రపటానికి ఎంపీపీ సుమతీ దేవి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కవయిత్రి దీవి ఝాన్సీ కవిత గానం విశేషంగా ఆకట్టుకుంది.తొలుత గ్రంథాలయ అధికారి ప్రభుదాసు స్వాగతం పలికి అతిథులను పరిచయం చేయగా కృపారావు వందన సమర్పణ చేశారు.

విలువలతోనే అత్యుత్తమ భవిత

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విలువలతోనే అత్యుత్తమ భవిత మానవీయ విలువులను పెంపొందించుకొని ముందుకు సాగే విద్యార్థులకు అత్యుత్తమమైన భవిష్యత్ సొంతమవుతుందని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షులు పీ విజయబాబు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 55వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఉత్సవం ఆ కళాశాల గ్రంథాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన పీ విజయబాబు మాట్లాడుతూ వివిధ కోర్సులకు తల్లిదండ్రులు లక్షలాది రూపాయాలను వెచ్చించి తమ పిల్లలను చదివిస్తున్నారన్నారు. దాంతో ఆ పిల్లలు ఆర్థికాంశాలనే ప్రధానంగా తీసుకొని ముందుకు సాగటం వలన విలువలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులు ఎక్కడైతే విలువలను బోధిస్తారో అక్కడ తమ పిల్లలకు విద్యాబుద్ధులను నేర్పించాలన్నారు. గ్రంథాలయాల విజ్ఞాన బండగారాలన్నారు. ఆ గ్రంథాలయాలు జానాన్ని, విజ్ఞానాన్నిఅందించే అద్భుత సాధానాలన్నారు. ఆ సాధానాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ ఉన్నతిని సాకారం చేసుకోవాలన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ వంటివి విద్యార్థులు ఆచరిస్తే అనుకున్నలక్ష్యాలను సాధిస్తారని వివరించారు. కేబీఎన్ కళాశాల 57 సంవత్సరాలుగా అద్భుతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తుందన్నారు. మరో అతిథిగా హాజరైన న్యాయవాది నరహరశెట్టి శ్రీహరి మాట్లాడుతూ గ్రంథాలయాలను వినియోగించుకొని అనేక మంది గొప్ప మహనీయులుగా ఎదిగారన్నారు. అటువంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలకు నగర వ్యాపితంగా పాఠశాలలు, కళాశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరుకావటం ఆనందంగా ఉందన్నారు. తమ కళాశాలలోని గ్రంథాలయం 82వేల పుస్తకాలతో విద్యార్థుల వికాసానికి అండగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త పీ శారదా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టీ భాగ్యకుమార్, గ్రంథాలయ విభాగాధిపతి శ్రీనివాసురాజు, అసిస్టెంట్ లైబ్రరియన్ నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : వెలగలేరు ప్రాంతంలో జరుగుతున్న జగనన్న ఇళ్ళ లే అవుట్‌లలో మౌలిక వసతుల పనులు వేగవంతం చేసి లబ్ధిదారుల గృహాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబందిత అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ళ లే అవుట్‌లలో జరుగుతున్న పనులను కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖాధికారులతో చర్చించి 24 గంటలు విద్యుత్ ఉండే విధంగా త్రీపేస్ కరెంటు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలవరం వాగు నుండి మంచినీటిని తీసుకువచ్చే విధంగా ఏర్పాటు చేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని నిరు పేదలకు సొంతింటి కలను నేరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జననన్న గృహ నిర్మాణ పథకం క్రింద అర్హులైన పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయటం జరిగిందన్నారు. లే అవుట్లో లబ్దిదారులు గృహా నిర్మాణం చేపట్టేందుకు అవసరమయిన కనీస సౌకర్యాలైన విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్పందనలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు సంబందిత అధికారులను ఆదేశించారు. స్పందనలో పునరావృతమవుతున్న అర్జీలకు సంబంధిత అర్జీదారులు, అధికారులతో స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి శనివారం కలెక్టర్ గూగుల్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావృతమవుతున్న(రీఓపెన్) స్పందన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్పందన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, పునరావృతం కాకుండా అర్జీదారుడు సంతృప్తి చేందేలా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా స్పందనలో పునరావృతమవుతున్న(రీ ఓపెన్) 6 అర్జీలకు సంబంధించిన సమస్యలను అర్జీదారులు, అధికారులతో ముఖాముఖీ నిర్వహించి పరిష్కారం చూపారు. ఏ కొండూరు మండలం కోడురుకు చెందిన వై.నాగేంద్రమ్మ, వై.నర్సమ్మ, విజయవాడ రూరల్ మండలం ఎనికెపాడుకు చెందిన ఫజిల్ రహెమాన్ ఖాన్, వత్సవాయి మండలం వేమవరం గ్రామానికి చెందిన కెం.వెంకటరమ, విజయవాడ రూరల్ గొల్లపూడికి చెందిన పి.జీవన్‌కుమార్, విజయవాడ మొగల్రాజ్‌పురంకు చెందిన వి.అంజలి దేవిల రెవెన్యూపరమైన సమస్యలను కలెక్టర్ గూగుల్ కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించారు.

ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఇంట్లో కూర్చో బెడతారు

విశాలాంధ్ర- అవనిగడ్డ: చంద్రబాబు కర్నూలు సభలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ తాట తీస్తా,తోలు వలుస్తా అంటున్నారని ఇలాగే మాట్లాడితే ప్రజలు ఈసారి ఇంట్లో కూర్చోబెడతారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సింహాద్రి విలేఖరులతో మాట్లాడుతూ తానేదో మాయలు మంత్రాలు వచ్చిన మాయగాడిలా చంద్రబాబు వింతగా మాట్లాడుతున్నారని, ఆయనకు అంత సీన్ ఉంటే మొన్న ఎన్నికల్లో ఎందుకు చిత్తుగా ఓడిపోయారని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ నరేంద్రమోడీని కలిసిన రోజు నుంచి చంద్రబాబు మానసిక స్థితి మారిపోయిందని కర్నూలులో ఆయన మాట్లాడిన తీరే అందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు రోజుకో విధంగా ప్రవర్తిస్తున్నారని, ఆయన ఏమి మాట్లాడుతున్నారో ఎవరికి అర్థం కావట్లేదన్నారు. చంద్రబాబు మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఏ.ఎం.సి కడవకొల్లు నరసింహారావు, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, వైఎస్సార్సీపీ నియోజక వర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉప్పెన మృతులకు నివాళి

విశాలాంధ్ర- అవనిగడ్డ: జాతీయ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దిడ్ల వీర రాఘవులు ఆధ్వర్యంలో 1977 ఉప్పెన మృతులకు నివాళులు అర్పించారు. మండల పరిధిలోని పులిగడ్డ తుఫాను మృతుల స్మారక స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఆనాటి ఘోర కలికి అసలు భాసిన మృతులకు ఘనంగా నివాళులర్పించారు అవనిగడ్డ రజినీకాంత్ షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదర్శినిలో ఆర్డీవో తనిఖీలు

విశాలాంధ్ర- పెదపారుపూడి: మండలంలోని అప్పికట్ల లో గ్రామదర్శిని కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ గా గుడివాడ ఆర్డిఓ పి. పద్మావతి విచ్చేశారు. అదేవిధంగా జమీదిం టకుర్రు గ్రామానికి నోడల్ ఆఫీసర్ గా వ్యవసాయ డివిజన్ అధికారి బి. గౌతమ్ పాల్గొన్నారు. గురువిందగుంట నోడల్ ఆఫీసర్ గా ఐ. జ్యోతిర్మయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా నోడల్ ఆఫీసర్లు ఆయా గ్రామాలలోని పాఠశాలలు, అంగనవాడి కేంద్రాలను, హెల్త్ సబ్ సెంటర్లు, స్వచ్ఛభారత్ షెడ్లు, పంచాయతీ కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర- కంచికచర్ల: జగన్న ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలని నందిగామ ఆర్డిఓ రవీంద్ర రావు పేర్కొన్నారు. శనివారం గండేపల్లి గ్రామము నందు జగనన్న హౌసింగ్ కాలనీలో గల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంనందు లబ్ధిదారులతో నందిగామ ఆర్డిఓ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయడానికి. అధికారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశం నందు హౌసింగ్ డిఇఇ కె. వీరభద్రరావు, నందిగామ తహశీల్దార్ నరసింహారావు, నందిగామ ఎంపిడిఓ శ్రీనివాసరావు, నందిగామ కంచికచర్ల, ఆర్డబ్లుఎస్ ,డిఇఇ,ఎఇ, నందిగామ , కంచికచర్ల, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

ఉప్పెన ఓ ఘోరకలి

విశాలాంధ్ర- అవనిగడ్డ: దివిసీమ ఉప్పెన మర్చిపోలేని ఘోరకలి అని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండల పరిధిలోని పులిగడ్డలో ఉప్పెన పైలాన్ వద్ద ఉప్పెన మృతులకు ఎమ్మెల్యే సింహాద్రి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో తీర ప్రాంతంలో ఉన్న దివిసీమ తరచూ విపత్తులను ఎదుర్కొంటోందన్నారు. తీర ప్రాంత కరకట్ట ఆధునీకరణకు సీఎం జగన్మోహన్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న ఏటిమోగ - ఎదురుమొండి వారధిని మంజూరు చేశారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, ఎంపిపి తుంగల సుమతీ దేవి, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మి నారాయణ, పులిగడ్డ, అవనిగడ్డ సర్పంచ్ లు దాసరి విజయకుమార్, గొరుముచ్చు ఉమా, స్థానిక ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ...అవనిగడ్ జనసేన పార్టీ ఆధ్వర్యంలో 1977సం. దివిసీమ ఉప్పెనలో మరణించిన అమరవీరులకు పులిగడ్డలో నిర్మించిన అమరవీరుల స్మారక స్థూపం వద్ద శనివారం ఘనంగా నివాళులర్పించారు. అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుడివాక శేషు బాబు, మత్తి వెంకటేశ్వరరావు లతోపాటు జనసేన నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరులో గ్రామదర్శిని

విశాలాంధ్ర- ఉంగుటూరు: జిల్లా కలెక్టర్ గారిఆదేశాల మేరకుశనివారం జిల్లా వ్యాప్తంగా గ్రామదర్శిని ప్రోగ్రాం నిర్వహించబడినది. దీనిలో భాగంగా వెన్నో తల బొకినాల ఆముదాలపల్లి ఎన్ఏపేట గ్రామాల్లో గ్రామదర్శిని ప్రోగ్రాం సంబంధిత గ్రామాల గ్రామదర్శిని ప్రోగ్రాం స్పెషలాఫీసర్లతో నిర్వహింపబడినది ఈ ప్రోగ్రాం లో పాఠశాల బాలబాలికల హాజరు మధ్యాహ్నం భోజన పథక జగనన్న గోరుముద్ద ను రేషన్ షాప్ నిర్వహణ అంగన్వాడీ ప్రీ స్కూల్లో పోషక ఆహారం లేని పిల్లలను గుర్తించడం జగనన్న స్వచ్ఛ సంకల్పం లో పరిశుద్ధాన్ని మెరుగుపరచటం నడక యాత్ర ద్వారా ప్రజల మనోవేదనలు పరిష్కరించడం ఈ విషయాలన్ని ఈ రోజున నిర్వహింపబడినది వెన్నోతల గ్రామానికి నియమించబడిన స్పెషలాఫీసర్ డిఎస్ఓ పార్వతి ప్రాథమిక పాఠశాలలోని జగనన్న గోరుముద్ద నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసి గ్రామంలో నడక యాత్ర ద్వారా ప్రజల మనోవేదనను జరిగింది.

అంగలూరులో ఇందిరాగాంధీ జయంతి

విశాలాంధ్ర, గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి పి.వి. వి. పద్మజ నేతృత్వంలో స్థానిక మహిళా కానిస్టేబుల్ జె.పల్లవి ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా సాధికారిత పైనా దిశ చట్టం పైనా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి మాట్లాడుతూ ఈ నెల 20 తో గ్రంథాలయ వారోత్సవాలు ముగుస్తాయనీ ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందచేస్తామని వెల్లడించారు.

ప్రజల స్పందన అమోఘం

విశాలాంధ్ర, గుడ్లవల్లేరు: ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన గ్రామదర్శిని కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై స్పందిస్తున్నారని ఎమ్. పి. డి. ఓ. దారపు శ్రీనివాస్ శనివారం అన్నారు. తాను పాల్గొన్న కట్టవాని చెరువు, చినగొన్నూరు, ఉలవల పూడి, కుచ్చికాయల పూడి గ్రామాలలో నిర్వహించిన గ్రామదర్శినిలో ప్రజలు రహదార్ల అభివృద్ధి, తాగు నీరు తదితర సమస్యలను ప్రస్తావించారని ఆయన తెలిపారు. గ్రామాలలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు చెందిన అధికార్లకు పంపుతామని ఎమ్. పి. డి. ఓ. వెల్లడించారు. గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యానికి అధిఖ ప్రాధాన్యం ఇవ్వవలసినదిగా ఆయాపంచాయతీ కార్యదర్శులను కోరామని ఆయన అన్నారు. సీజనల్ వ్యాధుల విషయంలో వైద్య ఆరోగ్యశాఖ శ్రద్ధ వహించాలనీ, ప్రజల ఆరోగ్య విషయంలో ఎప్పటికప్పుడు జాగరూకతతో వ్యవహరించాలని కోరినట్లు శ్రీనివాస్ వివరించారు.

71 మందికి నేత్ర పరీక్షలు

విశాలాంధ్ర - చల్లపల్లి : చల్లపల్లి లయన్స్ క్లబ్ విఆర్ కె. నగర్ వారి ఆధ్వర్యంలో శనివారం లయన్స్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. వంగల పట్టాభిరామయ్య - సీతారావమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ వెంకటరావు 71మందిని పరీక్షించి 18మందిని ఐఓఎల్ శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఏఎల్ఆర్కె.ప్రసాద్, నర్రా సాయిబాబు, మోపిదేవి వెంకటేశ్వరరావు, కొల్లిపర నాగపోతురాజు, కస్తూరి ప్రసాద్ లు పర్యవేక్షించారు.

యూనియన్ బ్యాంకు తరలించొద్దు



విశాలాంధ్ర-విజయవాడ: స్థానిక మధురానగర్‌లో 2008లో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌ను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాచవరం బ్రాంచ్‌లో విలీనం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ కార్పోరేటర్ పిల్లి లక్ష్మీతులసి కోరారు. ఈ అంశంపై శనివారం విజయవాడలో పార్లమెంటు సభ్యులు (రాజ్యసభ) కనకమేడల రవీంద్రకుమార్, శాసనమండలి సభ్యులు ఎం.డి.రుహుల్లా, ఏపీ రాష్ట్ర ఫైబర్‌నెట్ లిమిటెడ్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మధురానగర్ యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌కు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. బ్రాంచ్ తరలింపుతో దాదాపు 20 వేల మంది ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు, డిపాజిట్‌దారులు, బంగారు ఆభరణాలతో రుణాలు, గృహాల మీద రుణాలు తీసుకున్న ఖాతాదారులు, వయోవృద్ధులైన పెన్షనర్లకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరుతూ బ్యాంకు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించటం జరిగిందన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించటం జరిగిందని ఆమె వివరించారు.

స్టే ఉత్తర్వులను ధిక్కరించి ...

మధురానగర్ యూనియన్ బ్యాంకు శాఖను మాచవరం యూనియన్ బ్యాంకు శాఖలో విలీనం చెయ్యవద్దని జిల్లా వినియోగదారుల ఫోరం-2 న్యాయమూర్తి నవంబరు 30వ తేది వరకు స్టే మంజూరు చేశారని పిల్లి.లక్ష్మీతులసి చెప్పారు. న్యాయస్థానాన్ని ధిక్కరించి శనివారం మధురానగర్ బ్రాంచ్ నుంచి అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, గుమస్తా అన్నపూర్ణమ్మ లను మాచవరం బ్రాంచ్‌కి పంపించి విలీనం చేయటానికి అవసరమైన విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నవంబరు 21వ తేది నుంచి మాచవరం బ్రాంచ్ నందు బ్యాంకు లావాదేవీలు జరుగుతాయని మధురానగర్ బ్రాంచ్ గేట్ ముందు బోర్డు ఏర్పాటు చేయటాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళాతానని చెప్పారు. బ్యాంకు బ్రాంచ్ తరలించకుండా తాను చేస్తున్న ప్రయత్నానికి మద్దతు ఇచ్చిన స్థానిక పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, బ్యాంకు ఖాతాదారులకు లక్ష్మీతులసి కృతజ్ఞతలు తెలిపారు.